క్లుప్తంగా

నేటి నుంచి సీతానగరం రామాలయ పవిత్రోత్సవాలు

రాత్రి వేళ నిద్రలకు అనుమతి లేదు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సీతానగరంలోని శ్రీ కోదండ రామస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణంలో నిద్ర చేసే భక్తులను లోపలకు అనుమతించడం జరగదని దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఉపాలయమైన రామాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. పవిత్రోత్సవాల నేపథ్యంలో భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తారు.

3 నుంచి గంగానమ్మ ఆలయంలో దసరా మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీదుర్గా గాయత్రి అర్చక యాజ్ఞిక పురోహిత సేవా సంఘం అధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. ఉత్సవాలలో అమ్మ వారికి ప్రతి రోజూ విశేష కుంకుమ పూజలు నిర్వహిస్తామని ఆలయ ఫౌండర్ సభ్యుడు బసవ కాశీ విశ్వనాథ్, గౌరవ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై వత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని మాజీ మంత్రి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది బలిదానాలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటైందని గుర్తు చేశారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ గడ్డు పరిస్థితుల్లో ఉందని, ఇప్పటికే రెండు యూనిట్లు మూతపడ్డాయని, మూడో యూనిట్‌లో ఉత్పత్తి ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రుణ భారం చూపించి స్టీల్ ప్లాంట్‌ను విక్రయించేందుకు చూస్తోందన్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలో ఉండడంతో పాటు కేంద్రంలో భాగస్వామిగా ఉన్నారని, ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, ఇందు కోసం ప్రధాని మోదీ, అమిత్ షాతో మాట్లాడాలని సూచించారు. ప్రైవేటీకరణను అడ్డుకోకపోతే ప్రజలు క్షమించబోరన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ విషయంపై కేంద్రంతో పోరాడాలని, లేకపోతే రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్, సీఐటీయూ నాయకుడు నర్సింగరావు, ఎస్ఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

గాంధీజీ మహిళా కళాశాలలో హిందీ దినోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): హిందీ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గాంధీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ అన్నారు. గాంధీజీ మహిళా కళాశాలలో శనివారం హిందీ దినోత్సవం నిర్వహించారు. హిందీ విభాగాధిపతి కె.వసుంధరాదేవి మాట్లాడుతూ హిందీ దినోత్సవ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు పోటీలను నిర్వహించి బహుమతీప్రదానం చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టైలర్ వద్దకు వెళ్లి దుస్తులు కుట్టించుకుని వస్తానని వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన రామరాజ్యనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. సితార సెంటర్ సారంగం ప్రాంతానికి చెందిన యువతి(21) పదో తరగతి వరకు చదువుకుంది. కొంత కాలం షాపులో పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటోంది. ఇటీవలే ఆ యువతికి ఎంగేజ్‌మెంట్ అయింది. శనివారం ఉదయం 10 గంటల సమయంలో టైలర్ వద్దకు వెళ్లి దుస్తులు కుట్టించుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. యువతి తల్లి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. చుట్టుపక్కల వారిని, బంధువులను ఆరా తీసినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో కొండ ప్రాంతానికి చెందిన విజయ్‌తో మాట్లాడేదని, అతనిపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరు రోడ్డు రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం బాధ్యుడు టి.క్రాంతి కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో ఎంఎస్ ఆఫీస్ విత్ పవర్ బీఐ, డీటీపీ, ఫొటోషాప్, ఇంటర్‌నెట్ బేసిక్స్, సీ లాంగ్వేజ్ కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీలోగా 73821 93413 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

శివారులో... ఇంకా అవే కష్టాలు!

- నగరానికి వరద తగ్గినా శివారు ప్రాంతాల్లో భారీగా ప్రవాహం
- గాడిలో పడని జన జీవనం
- ఎక్కడికక్కడ గండ్లు పెట్టి వరదను మళ్లిస్తున్న అధికారులు
- జిల్లా వ్యాపితంగా విజృంభిస్తున్న జ్వరాలు
- కొనసాగుతున్న నష్ట గణన
- పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



కండ్రికలో ఏ ఇంటి ముందు చూసినా ఇవే దృశ్యాలు



కండ్రిక-అంబాపురం మధ్య ప్రాంతంలో మోటర్లతో నీటిని తోడిస్తున్న అధికారులు



సింగ్‌నగర్ ప్రాంతం వద్ద వరద నీటిలో మునిగిన వస్తువులను బయట పడవేస్తున్న దృశ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడలో బుడమేరు వరద ప్రభావం తగ్గినా శివారు ప్రాంతాల్లో ఇంకా వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. దీంతో జిల్లా వాసులు ఇంకా కష్టాల్లోనే తల్లడిల్లుతున్నారు. నగరంలో వరద ప్రభావిత ప్రాంతాలైన సింగ్‌నగర్, పాతరాజరాజేశ్వరిపేట, ఆంధ్రప్రభ కాలనీ, కండ్రిక, కొత్త రాజరాజేశ్వరిపేట నివాసితులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. అయితే ఆ నష్టాల నుంచి తేరుకోవటానికి చాలా సమయం పడుతుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో చెత్త తొలగింపు, తరలింపు కార్యక్రమాలు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో వేగంగా కొనసాగుతున్నాయి. ఎంత చేస్తున్నా ఇంకా సమస్యలు వెంటాడుతునే ఉన్నాయి.

శివారు ప్రాంతాల్లో భారీగా ప్రవాహం

నగరానికి వరద తగ్గినా శివారు ప్రాంతాల్లో భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రధానంగా నగరాన్ని ఆనుకుని ఉన్న అంబాపురంలో జనజీవనం ఇంకా గాడిలో పడలేదు. అంబాపురంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం సైతం కొంత వరద నీరు భారీగా ప్రవహిస్తూ కనిపించింది. లోతట్టు ప్రాంతాల్లో ఇంకా నాలుగైదు అడుగుల మేర నీరు ప్రవహిస్తూ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇన్నర్‌రింగ్ రోడ్డు నుంచి అంబాపురం గ్రామం మధ్యలో ఉన్న ప్రాంతాల్లో భారీగా నీరు తిష్ట వేసింది. నగర పరిసర ప్రాంతాల నీరును అటుగా మళ్లించటంతో ఆ మేర ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచిందని స్థానికులు చెబుతున్నారు. జక్కంపూడిలోని కొన్ని పల్లపు ప్రాంతాల్లోనూ అడుగు మేర మురుగు నీరు దర్శనమిస్తోంది.

ఎక్కడికక్కడ గండ్లు పెట్టి వరద మళ్లింపు

నగర శివారు ప్రాంతాల్లో నిలిచిన నీటిని బయటకు తరలించేందుకు అధికారులు ఎక్కడికక్కడ గండ్లు కొడుతున్నారు. నాలుగైదు రోజులుగా ఈ విధమైన గండ్లు కొట్టి నీటిని మళ్లిస్తున్నారు. జక్కంపూడి నుంచి కండ్రిక వరకూ నగరానికి ఉత్తరాన ఉన్న అన్ని ప్రాంతాల్లో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాంతో ఆ పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న ప్రజానీకం ఇంకా ఇబ్బందులతోనే సహజీవనం చేస్తున్నారు.

జిల్లా వ్యాపితంగా జ్వరాలు

జిల్లా వ్యాపితంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో జ్వర పీడిత బాధితులు అధికమవుతున్నారు. ప్రధానంగా జిల్లాలో బుడమేరు వరద నీటిలో మునిగిన ప్రాంతాల్లో ప్రజలు ఉన్న సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు నామమాత్రంగా ఉండటంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. స్థానికంగా ఉన్న ఆసుపత్రులన్నీ జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి.



ఇంట్లో మురుగు నీటిని శుభ్రం చేసుకుంటున్న యువకుడు

ఇంకా కొనసాగుతున్న నష్ట గణన

జిల్లాలో వరదల వలన కలిగిన నష్ట పరిస్థితులను, వాటి విలువలను నమోదు చేసే ప్రక్రియ శనివారం సైతం కొనసాగింది. జిల్లాలో జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సృజన శనివారం వాంబేకాలనీకి వెళ్లి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పలు బృందాలు నష్ట గణన కార్యక్రమాన్ని నిర్వహించాయి.

వరద ముంపు బాధితులకు మెప్మా చేయూత

మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురై నష్టపోయిన బాధితులకు మెప్మా, అర్బన్ కంపెనీ సంయుక్తంగా సేవలు అందిస్తున్నాయని మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. ముంపు బాధితులకు అందించే సేవలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన శనివారం మెప్మా ఆర్పీలు, యూడీసీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ్ భరత్ మాట్లాడుతూ జిల్లాలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకు సేవలు అందించేందుకు సింగ్‌నగర్, వాంబే కాలనీ, భవానీపురం, పాయకాపురం, కండ్రిక, రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి మెప్మా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుసంధానంతో అర్బన్ కంపెనీ యాప్ ద్వారా వివిధ సేవలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. మెప్మా ఆర్పీలు, సిబ్బంది వారి పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి అవసరమైన సేవలు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ-రిక్వెస్ట్‌ల ఆధారంగా టెక్నీషియన్లు స్వయంగా బాధితుల ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, పెయింటర్‌లు, కార్పెంటర్‌లు, ఏసీ మెకానిక్కులు, టీవీ టెక్నీషియన్లు మొత్తం 200 మంది సేవలు అందిస్తున్నారని తెలిపారు. అవసరం మేరకు బయట ప్రాంతాల నుంచి కూడా టెక్నీషియన్లను రప్పించి సేవలు అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలు, చెక్క వస్తువులు, పెయింటింగ్ పనులకు సంబంధించి యాప్‌లో సూచించిన రేట్లకే సేవలు అందిస్తారని తెలిపారు.

తెలుగు జాతికి 'గాడిచర్ల' సేవలు చిరస్మరణీయం

లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి



గాడిచర్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస రెడ్డి, రావి శారద తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు జాతికి గాడిచర్ల చేసిన సేవలు చిరస్మరణీయమని ఆంధ్ర లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రంథాలయ వయోజన ఉద్యమ నాయకుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతి సందర్భంగా గాడిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటమట సర్వోత్తమ భవన్‌లో శనివారం నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ ఉద్యమ ప్రారంభంలోనే దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన తొలి తరం నాయకులలో గాడిచర్ల ముందు వరుసలో నిలుస్తారని తెలిపారు. నాడు తెలుగునాట జరిగిన సాంఘిక సంస్కరణల ఉద్యమాల్లో గాడిచర్ల పాత్ర కీలకమన్నారు. స్వాతంత్ర్య సమర యోధునిగా బ్రిటిష్ వారికి ఎదురొడ్డిన సాహస వీరుడిగా, పత్రికా సంపాదకునిగా, ఆంధ్రోద్యమ ముఖ్యనేతగా తెలుగు జాతికి గాడిచర్ల అందించిన సేవలు నిరుపమానమన్నారు. సర్వోత్తమ గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ డి.ప్రసాద్ మాట్లాడుతూ 120 ఏళ్ల క్రితమే ఎంఏ ఉత్తీర్ణుడై దేశ సేవా రంగంలో ప్రవేశించి స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దుర్భరమైన కారాగార వాసం చేసిన వ్యక్తి గాడిచర్ల అని గుర్తు చేశారు. నాటి త్యాగధనుల ఆశయాలను పునశ్చరణ చేసుకుంటూ ప్రజల్లో విద్య, విజ్ఞానవ్యాప్తికి కృషి చేయటమే గాడిచర్లకు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ గాడిచర్ల జీవిత విశేషాలతోపాటు ఫౌండేషన్ ఆవిర్భావం, తద్వారా గత రెండున్నర దశాబ్దాలుగా చేసిన కృషి వివరించారు. కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ సంఘ సభ్యులు, గ్రంథాలయ శిక్షణాలయం విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యమే మానవ హక్కుల ప్రామాణిక సూత్రం



భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆంధ్ర లయోలా కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం సదస్సు నిర్వహించింది. డాక్టర్ శ్రీకుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అనేది మానవ హక్కులకు ప్రామాణిక సూత్రమని అన్నారు. ఆర్టికల్ 14, 21 గురించి లోతైన విశ్లేషణను విద్యార్థులకు వివరించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, ద్వితీయ సంవత్సరం వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ రాజనీతి శాస్త్ర విభాగం కృషిని కొనియాడారు. సదస్సులో డాక్టర్ శామ్యూల్ దయాకర్, రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ కల్యాణి, డాక్టర్ మిరియం కమల, డాక్టర్ రాంబాబు రాజనీతి శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

వీణాపాణిగా శ్రీ బాలగణపతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో కొలువై ఉన్న శ్రీ బాలగణపతి స్వామి వారు వీణను ధరించి వీణాపాణి గణపతిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయంలో జరుగుతున్న స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక సహస్ర నామార్చన కొనసాగించారు. సహస్ర మోదక పూజను అర్చకులు జరిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకోవటానికి తరలివచ్చారు.

సందడిగా కోలాటం పోటీలు

బాలగణపతి ఆలయంలో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం మహిళలకు కోలాటం పోటీలను నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా బృందాలు కోలాటం పోటీల్లో చురుకుగా పాల్గొని హడావుడి చేశారు. ఈ సందర్భంగా వేడుకల పందిట్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు. వాహన సేవను సైతం వైభవంగా నిర్వహించారు.

చిన్న తరహా పరిశ్రమలకు ప్రభుత్వం సాయం అందించాలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వరదలతో తీవ్రంగా నష్టపోయిన చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద ఉధృతితో నగరంలోని అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రూ.లక్షలు విలువ చేసే యంత్రాలు పాడైపోవడమే కాకుండా అనేక మంది ఉపాధికి దూరమయ్యారని విచారం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఫర్నీచర్, ప్లైవుడ్, ప్రింటింగ్ పరిశ్రమలతో పాటు కిరాణా, పండ్లు, పూలు సహా ఇతర చిరు వ్యాపారులు తీవ్ర నష్టాన్ని చవిచూశారన్నారు.

250కి పైగా వర్క్ షాపులు..

అజిత్ సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట, రాజీవ్ నగర్, పైపులరోడ్డు, వాంబేకాలనీ, కండ్రిక వంటి చోట్ల దాదాపు 250కి పైగా వర్క్ షాపులు ఉన్నాయని.. వాటన్నింటిలో ముంపు నీరు చేరడంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఒక్కో వర్క్ షాప్ యజమాని కనీసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోయారని.. వారందరినీ ఎన్యూమరేషన్‌లో చేర్చాలని సూచించారు. మరోవైపు వేల మంది కార్మికుల ఉపాధికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల పాటు ఆయా వర్క్ షాపులు, పరిశ్రమలలో పనులు చేపట్టలేని పరిస్థితులు నెలకొనడంతో.. వీరందరినీ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వరదలను జాతీయ విపత్తుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులు ఓదార్పు మాటలకు పరిమితం కాకుండా.. కేంద్రం నుంచి నిధులు రాబట్టి సర్వం కోల్పోయిన కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పలు చోట్ల పశువులు, గోవులు, పందులు సహా ఇతర జంతువులు కొట్టుకుపోవడంతో జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలను సైతం ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని మల్లాది విష్ణు కోరారు.

ప్రథమ చికిత్సలపై అవగాహన అవసరం



ఎన్‌సీసీ క్యాడెట్లతో డాక్టర్ సమరం, ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అత్యవసర సమయంలో అందించే ప్రథమ చికిత్సలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అన్నారు. ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నలంద డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ సమరం మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో కార్డియో పల్మనరీ రీససిటేషన్(సీపీఆర్) చేసే విధానాన్ని తెలుసుకోవడం వలన ప్రాణాలు నిలబెట్టవచ్చునన్నారు. ఏ ప్రమాదం జరిగినా అత్యవసరంగా అందించాల్సిన ప్రాథమిక చికిత్స అందరికీ తెలియడం ఎంతో ఉపయోగమని చెప్పారు. వైద్య సదుపాయం అందేలోపు ఫస్ట్ ఎయిడ్ అందించడం వలన చాలా వరకూ ప్రాణాపాయం లేకుండా చూడవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లను యూత్ రెడ్‌క్రాస్ తరపున వరద బాధితులకు సహాయ, సహకారాలు అందించినందుకు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, రెడ్‌క్రాస్ మెంబర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో ఏఐ, ఎంఎల్ కీలకపాత్ర

వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ శ్యామ్



ప్రొఫెసర్ శ్యామ్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కల్పన, అధ్యాపకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బయోలాజికల్ సైన్స్, డ్రగ్ డిస్కవరీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వంటి పలు సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) నూతన సాంకేతిక మార్పులు, అభివృద్ధిలో కీలకంగా ఉన్నట్లు వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్యామ్ అన్నారు. నగరంలోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఏపీసీటీఇ ట్రెనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), సైబర్ సెక్యూరిటీ అనే అంశాలపై వారం రోజుల పాటు నిర్వహించిన సదస్సు శనివారం ముగిసింది.

ముగిసిన సదస్సు..

ఈ సదస్సులో పలువురు నిపుణులు ఆధునిక సమాజంలో టెక్నాలజీ అభివృద్ధి, వాటి ప్రాముఖ్యత గురించి పలు ప్రాంతాల నుంచి వచ్చిన నిపుణులు వివరించారు. చివరి రోజు సదస్సులో డాక్టర్ పి.శ్యామ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాధాన్యతను వివరించారు. అన్ని రంగాల్లో ఈ టెక్నాలజీ ఉనికిని తెలియజేశారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో అధ్యాపకులు, 67 మంది పీజీ విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.మాధవి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ మోహన రూప ఎస్‌వీడీ, కో ఆర్డినేటర్ డాక్టర్ వి.సంధ్యాలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం.ప్రవీణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.హారిక, కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న గణేశ నిమజ్జనాలు



పాతబస్తీలో వినాయకచవితి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో గణేశ నిమజ్జనాలు శనివారం అత్యంత వైభవంగా కొనసాగాయి. వీధివీధినా ఏర్పాటుచేసిన గణనాథులను కృష్ణానదికి నిమజ్జనానికి తరలిస్తున్నారు. శనివారం సెలవు దినం కావటంతో పెద్ద సంఖ్యలో నిమజ్జనాలు కొనసాగాయి. మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ ఈ నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. నిమజ్జనాల ఊరేగింపులతో వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారులన్నీ కళకళలాడుతున్నాయి. జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై అనే నినాదాలు వన్‌టౌన్‌లో మార్మోగాయి. ఆయా చవితి పందిళ్ల నిర్వాహకులు మేళతాళాలతో, కోలాట విన్యాసాలు, జానపద కళారూపాలతో నృత్యాలు చేసుకుంటూ సందడి చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి విగ్రహాలకు వన్‌టౌన్ మీదుగా కృష్ణానదికి తరలివెళ్లాల్సి రావడంతో ఈ ప్రాంతాలన్నీ సందడిగా దర్శనమిస్తున్నాయి. గవర్నరుపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు ఫ్లైఓవర్, కెనాల్‌రోడ్డు, రథం సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా కృష్ణానదికి చేరుకుంటున్నాయి. వన్‌టౌన్‌లోని విగ్రహాలు కేటీరోడ్డు, మెయిన్‌బజార్, బ్రాహ్మణవీధి, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా తరలివెళ్తున్నాయి. దాంతో ఆయా ప్రాంతాలన్నీ ఊరేగింపులతో కిక్కిరిసి దర్శనమిస్తున్నాయి.

పలు చవితి పందిళ్లను దర్శించిన ఆసిఫ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న గణపతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మల్లికార్జునపేట తదితర ప్రాంతాల్లో ఆయా నిర్వాహకుల ఆహ్వానాల మేరకు హాజరై నిమజ్జన ఊరేగింపులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు నరేంద్ర, శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, కర్రి గౌరి, నీలిమ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హరికథాగానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నెమ్మలూరు చంద్రశేఖర్ ప్రదర్శించిన హరికథాగానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చంద్రశేఖర్ హరికథాగానాన్ని చక్కటి వ్యాఖ్యానంతో వివరించారు. హరికథ భాగవతార్ చంద్రశేఖర్‌కు తబలాపై లక్ష్మీనారాయణ, హార్మోనియంపై అప్పారావు చక్కటి వాయిద్య సహకారాన్ని అందజేశారు. అనంతరం హరికథా భాగవత బృందానికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

వరద బాధితులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు ప్రభుత్వం తక్షణం ఆర్థిక సహాయం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటేనే, విజయవాడ నగర ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతుందన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న భోజన కేంద్రాలను, ముంపు ప్రాంతాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు నిలిచిపోయాయని, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భోజన కేంద్రాలపైనే బాధితులు ఆధారపడుతున్నారన్నారు. బాధితులకు కోసం వైఎస్సార్‌కాలనీ, శాంతినగర్ ప్రాంతాలో మరో రెండు భోజన కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

సమాచార సేకరణ పేరుతో కాలయాపన..

ప్రభుత్వం బాధితులకు ఆర్థిక సహాయం అందించకుండా సమాచార సేకరణ పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. వరద తగ్గినా ప్రజల కష్టాలు తగ్గలేదని, వారి జీవితాలు గాడిన పడలేదన్నారు. ప్రభుత్వం అందించిన బియ్యం నాణ్యత లేవని, తినడానికి ఉపయోగకరంగా లేవన్నారు. ప్రభుత్వం అన్ని రకాల నిత్యవసరాలు, నాణ్యమైన బియ్యం అందించాలన్నారు. గ్యాస్ స్టవ్‌లు, మంచినీటి మోటార్లు రిపేర్లు చేయించాలని, తక్షణ ఆర్థిక సహాయం కనీసం రూ. 25 వేలు అందించాలని డిమాండ్‌చేశారు. సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, శ్రీదేవి, బోయి సత్యబాబు, బి.రమణరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, స్టీల్ సామగ్రి పంపిణీ



సాయం అందిస్తున్న సునీత శంకర్, దేవీ పవన్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు గుంటూరు జిల్లా మోరంపూడికి చెందిన సునీత అభ్యుదయ సేవా సమితి, విజయవాడకు చెందిన జయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు, స్టీల్, అల్యూమినియం వంట పాత్రలు పంపిణీ చేశారు. విద్యాధరపురం కబేళా, సింగ్‌నగర్, రామవరప్పాడు ప్రాంతాల్లోని ముంపు బాధితులకు వాటిని అందజేశారు. ట్రస్ట్ ట్రెజరర్ సలాది నాగజ్యోతి, శ్రీవాణి, శ్రావ్య పాల్గొన్నారు.